# ఘనంగా చక్రస్నానం

- ఉత్సవమూర్తులకు 108 కళాశాలతో తిరుమంజనం


స్వామి వారికి చక్ర స్నానం నిర్వహిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహెూబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో నరసింహ జయంతి ఉత్సవాలలో భాగంగా బుధవారం ఉత్సవమూర్తి సుదర్శన మూర్తికి కోనేరులో చక్ర స్నానం చేయించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, మధుసూదనాచార్యులు,అర్చక బృందం కోనేరు ప్రాంగణంలో ఉత్సవమూర్తులు శ్రీ జ్వాలా నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు తిరుమంజనం మిగతా 2లో

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
## కర్నూలు | నంద్యాల
గురువారం | 23 మే 2024 పేజీలు 16



## ఆరోగ్య శ్రీ సేవల పై

2లో

# దిద్దుబాటు

- ఆశా ప్రకటనతో డాక్టర్ల ప్రతినిధులతో కలెక్టర్ చర్చలు
- ఎమర్జెన్సీ సేవలకు గ్రీన్ సిగ్నల్
- ఐశ్చిక సేవలను పూర్తి స్థాయిలో కష్టం
- సేవలు ఆర్థిక భారమంటూ వ్యాఖ్యలు
- నెట్‌వర్క్ యాజమాన్యాలు 23 - హాజరు ఒక్కరు
- హాజరైన నంద్యాల ఐఎంఎ బ్రాంచ్ ప్రతినిధులు
- ఉమ్మడి కర్నూలు జిల్లా బకాయిలు రూ.200 కోట్లు పై మాటే

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య శ్రీ సేవలను నిలిపి వేస్తామని ఆశా ప్రకటనతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోకుండా దిద్దుబాటు చర్యలను చేపట్టింది. డాక్టర్ల ప్రతినిధులతో కలెక్టర్ శ్రీనివాసులు చర్చలు జరిపారు. ఎమర్జెన్సీ సేవలను కొనసాగిస్తామని వైద్యుల బృందం హామీ ఇచ్చింది. ఐశ్చిక సేవలను పూర్తి స్థాయిలో కొనసాగించడం కష్టమని వైద్యుల బృందం స్పష్టం చేసింది. ఆరోగ్య శ్రీ సేవలు ఆర్థిక భారమంటూ వైద్యుల బృందం వ్యాఖ్యానించింది. నంద్యాల జిల్లాలో నెట్‌వర్క్ హాస్పటల్స్ యాజమాన్యాలు 23 ఉంటే ఒక్కరు, వైద్యుల తరుపున ఐఎంఎ నంద్యాల బ్రాంచ్ ప్రతినిధులుహాజరయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.200 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లుతెలుస్తోంది. నంద్యాల జిల్లాలో సుమారు రూ. వంద కోట్ల బకాయిలు ఉన్నాయి. మంగళవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులతో ఆశాచర్చలు విఫలం కావడంతో బుధవారం నుంచి ఆరోగ్య శ్రీ సేవలను నిలిపి వేస్తున్నట్లు ప్రకటించిన విషయం పాఠకులకు విధితమే.రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. వైద్య ఆరోగ్య శాఖ హెల్త్ సెక్రటరీ నెట్‌వర్క్స్ హాస్పటల్స్ యాజమాన్యాలతో చర్చలు జరపాలన్న సూచన మేరకు నంద్యాల జిల్లా కలెక్టర్ బుధవారం చర్చలు జరిపారు. ఆరోగ్యశ్రీ అత్యవసర సేవలపై యాజమాన్యాలు సానుకూలంగా స్పందించాయి. వివరాల్లోకి వెళ్లితే...


కలెక్టర్ సమీక్షలో నిలబడిన ఐఎంఎ ప్రతినిధులు మరియు నెట్‌వర్క్ యజమాని డా. సోమశేఖర్‌రెడ్డి

## పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- పది,ఇంటర్ పరీక్షల పై విద్యాశాఖాధికారులతో కలెక్టర్ సమీక్ష

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** పదవ తరగతి, ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు విద్యాశాఖాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో పది, ఇంటర్ పరీక్షలపై కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పదవ తరగతి పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల24వతేదీ నుంచి వచ్చేనెల మిగతా 2లో


విద్యాశాఖాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

### తొలికరి వర్షాలతో
## దుక్కికి సిద్ధమైన రైతులు

- వర్షం కురవడంతో రైతులు హర్షం
- పంట పొలాల్లో విత్తనాలు విత్తుతున్న కూలీలు


పొలంలో రైతు దుక్కి దున్నుతున్న (ఫైల్‌ఫోటో)

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్:** మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం వల్ల రైతులు బుధవారం కల్లుకుంట, మేకడోనా, నౌలకల్, బసలదోడ్డి, కంభళదహల్, కంభళదిన్నే, చిన్నతుంభళం,హెచ్.మురువణీ, పెద్దకడుబూరు, మిగతా 2లో

### ఖజానాకు గండి..
# చెరువు మట్టెక్కింది బండి



- గత ఏడాదే అక్రమ నిలువలు
- పంటపొలాల్లో నిలువలు
- ఇటుకల వ్యాపారులదే ఇష్టా రాజ్యం
- కాసులిస్తే.. అంతా గప్ చిప్

**ఎమ్మిగనూరు ప్రతినిధి, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు పరిసర ప్రాంతాల్లో అంత వలస వ్యక్తులదే వ్యాపార దందా..వారిచ్చే కాసుల నాజరానా వారు ఇస్తారాజ్యానికి పునాధులు వేసి భవంతులు నిర్మిస్తుంది.. ఏవ్యాపారం చేసినా అందేవేసిన చేయిలా దూసుకు పోవడంలో వారికీ వారే సాటి.. బతుకుదెరు వుకు వచ్చి ఇటుకల వ్యాపారంతో స్థిరపడి.. ఉన్న కొద్ది కుటుంబాలు సైతం రాజకీయాలను శాశించే స్థాయికి చేరుకొన్నారు అంటే ఇక్కడ వారికీ వుండే రాజకీయ అండదండలు ఏ పాటివో అర్థమవుతుంది.. ఖజానాకు గండి కొడుతూ.. చెరువు మట్టి అక్రమంగా బండి ఎక్కిస్తూ వారి ఇటుకలు వ్యాపారాన్ని ఆధాయ వనరుగా మాచుకొన్నారు. మిగతా 2లో

### రైతులను నష్టపరిస్తే
## విజయ డైరీ సహించదు
వార్త 8లో

### లెక్కింపు రోజు విధ్వంసాన్ని అడ్డుకునేందుకు
## పోలీస్ వ్యూహం
వార్త 5లో

### ఇసుక అక్రమ తవ్వకాలను
## అరికట్టండి
వార్త 8లో

# ఖజానాకు గండి..చెరువు మట్టెక్కింది బండి

(మొదటి పేజి తరువాయి)

నందవరం మండల పరిధిలో ధర్మపురం గ్రామ సమీపంలో దేశా య్ చెరువు మట్టి నిల్వ చేసుకొని అక్రమార్జనకు దారులు వేసుకొ న్నారు.. అక్కడ పంట పొలాల కోసం వేశామని నమ్మబలికించి ఏడాది తర్వాత ఇటుకల బట్టీలకు నిలువ ఉంచిన మట్టిని కొందరు అక్రమర్కులు తరలించు కొంటున్నారునే ఆరోపణలు వున్నాయి. ఇటుకలు వ్యాపారం లక్షలలో చేపడుతున్న వారు ప్రభుత్వ ఆస్తుల ను దోచుకొని దర్జగా ఆధాయాన్ని గండి కొట్టడం పరపాటిగా మార్చుకొన్నారు. ఇక బీహార్.. రాజస్థాన్.. ఒడిస్సా నుండి వచ్చిన వలసకూలీల మధ్య న చిచ్చు పెట్టి కార్మిక చట్టాలకు మంగళం పాడుతూ కూలీలకు నోట్లో మట్టి కొడుతు న్నారు.. అంతటితో ఆగక వారి మరణాల కు కారకులు అయిన ఇక్కడ ఎవరు పట్టిం చుకోరు.. కాసులకు అలవాటు పడ్డ నాయ కులు అందదండలతో అధికారుల నోరు నొక్కేస్తున్నారనే అనుమానలు లేకపో లేదు.. ఇంత వరకు పొలం వారు మట్టి వేసుకొని వున్నారు అనుకుంటే అక్కడి నుండి రెండు మూడు రోజులుగా తరలిపోతున్న నిల్వ మట్టికి ఎక్కడా సమాధానం లేదు. నాయకు లకు నాజరా ణాలు.. అధికారులకు ప్యాకేజి అందిస్తున్నాం మా ఇష్టారాజ్యానికి అడ్డు వచ్చేది ఎవరు అని బాహట్టంగా చెప్పుకో వడం చూస్తుంటే ఇక్కడ నేతలు సెటిలర్ లకు ఎంత ఊతం ఇస్తున్నారు అని ప్రజలే ముక్కున వేలేసుకొంటున్నారు. ఇటుకల వ్యాపారం మొదులుకొని వ్యభిచారం నిర్వ హించే విధానాలకు అనువుగా వసతి భావనలు నిర్మించే వరకు వలస వ్యక్తులదే అందే వేసిన చేయి అయింది.అక్కడికే ఆగక పొగ విన్న కొద్ది కుటుంబాల వారు రాజకీ యాలను శాశిస్తున్న ఇక్కడి నాయకులు చంకన ఎక్కించుకోవడం ఎమ్మిగనూరు ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు.. ఇక్కడ నేతలు,అధికారులు ఇటుకల వ్యాపారుల అక్రమాలకు స్వస్తి పలుకుతారో లేదో వేచి చూద్దాం..

# ఆరోగ్య శ్రీ సేవలపై దిద్దుబాటు

(మొదటి పేజి తరువాయి)

గత ఆగస్టు నుంచి నెట్వర్క్ హాస్పటల్స్ యజామాన్యాలకు ఆరోగ్య శ్రీ సేవల బిల్లులు నిలిచిపోయాయి. రూ. 1500 కోట్ల బకాయిలు ఉన్నట్లు ఆశా ప్రకటించింది. ఆశాతో ఆరోగ్య శ్రీ ట్రస్ట్ అధికారుల చర్చల అనంతరం రూ. 203 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోకుండా ప్రభుత్వం యాజమాన్యాలతో చర్చలను జరుపుతుంది. నంద్యాల జిల్లాలో బుధవారం జరిగిన చర్చల్లో నెట్వర్క్ యాజమాన్యం డా. సోమశేఖర్‌రెడ్డి, ఐఎంఎ నంద్యాల బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు డా. వసుధ, డా. ఫణీల్ కుమార్‌లతోపాటు డిసిహెచ్ఎస్ డా. జప్రుల్లా, డిఎం అండ్ హెచ్ఓ వెంకట రమణ, ఆరోగ్య శ్రీ డిస్టిక్ట్ కో ఆర్డినేటర్ రూపేంద్రనాథ్‌రెడ్డి,ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరిం టెండెంట్ డా. వర ప్రసాద్, ఆరోగ్య శ్రీ మేనేజర్ శ్రీధర్‌లు హాజరయ్యా రు. జిల్లాలో ఆరోగ్య శ్రీ బకాయిలు రూ. కోట్లల్లో ఉన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్ళారు. ప్రతి మూడు నెలలకు ఒక్కసారి నిధులు విడుదల అయ్యేలా చూడాలని కోరారు. నిర్వహణ ఆర్థిక భార మంటూ వైద్యులు వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ సేవలను కొనసాగిస్తామ ని చెబుతూనే ఐశ్చిక ఆపరేషన్ల నిర్వహణలో ఆర్థిక భారం కష్టంగా ఉన్నట్లు వైద్యులు వ్యాఖ్యానించారు. ఐశ్చిక ఆపరేషన్ల విషయంలో మందులతోపాటు రోగికి అందించే సేవలను అందించేందుకు ఆర్థికం



నెట్‌వర్క్ హాస్పిటల్ మల్టి స్పెషాలిటి హాస్పిటల్ సెవెన్ హిల్స్

గా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు వైద్యులు చెప్పుకొచ్చారు. మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించడంతోపాటు బకాయిల విడుదల కొరకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణలో జిల్లా కలెక్టర్లు విధుల్లో ఉన్నారని, ప్రభుత్వం దృష్టికి బకా యిల అంశాన్ని తీసుకొని వెళ్తున్నామని వైద్యుల బృందానికి చెప్పుకొ చ్చారు. ఆరోగ్య శ్రీ సేవలను కొనసాగించాలని కోరారు. చర్చల సమ యంలో హాజరైన వైద్యుల బృందాన్ని కూర్చొమని అధికారులు చెప్పక పోవడంపై వైద్యుల బృందం పెదవి విరుస్తున్నారు. ఎంతో కీలకమైన సమావేశం కేవలం మూడు నుంచి ఐదు నిముషాల్లో ముగియ్యడం కొసమెరుపు..

# నేడు శ్రీమహావిష్ణువు నృసింహావతారం దాల్చిన రోజు

**-వైశాఖ చతుర్దశి రోజున నృసింహ జయంతి**
**-శ్రీమఠంలో నేడు షోడషబాహు నృసింహునికి విశిష్టపూజలు**



**మంత్రాలయం,మేజరున్యూస్:** శ్రీమహావిష్ణువు దశావతారాలలో అత్యంత ఉగ్రరూపం నృసింహావతారం లో కనిపిస్తుంది. వైశాఖ చతుర్దశి నాడు నృసింహ జయంతిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది. దశావతారాలలో నాల్గవ అవతారం నరసింహావతారం. నరసింహ జయంతి అనగా...వైకుంఠద్వారపాలకుడైన శంకుర్ణుడు బ్రహ్మదేవుని శాపం కారణంగా రాక్షసరాజు హిరణ్యకశ్యపుని కుమారుడైన ప్రహ్లాదుడు. శ్రీమహావిష్ణువు తనకు బాలభక్తుడైన ప్రహ్లాదుని మాట నిలబెట్టుట కొరకు, క్రూరుడైన హిరణ్యాకశ్యపుడు అనే రాక్షసరాజును చంపి మానవులను, విష్ణు భక్తులైన మునులను కాపాడటం కోసం హిరణ్యాకశ్యపుడు దేవతలచే పొందిన వరాలకు అతీతమైన అవతారం దాల్చాడు. అదే నరసింహావతారం. హిరణ్యాకశ్యపుడను రాక్షసరాజు విష్ణుద్వేషి. హిరణ్యాకశ్యపుడు తన సోదరుడైన హిరణ్యాక్షుడు సైతం దేవతలను, మానవులను, మునులను బాధిస్తూ బలగర్వంతో భూమిని పైకి ఎత్తి సముద్రంలో వేయడం జరిగింది. మహారుషుల ప్రార్థనలతో శ్రీమహావిష్ణువు వరాహరూపం ధరించి భూమిని కాపాడి హిరణ్యాక్షున్ని సంహరించడం జరుగుతుంది. ఈ సంఘటనతో కోపోద్రికుడైన హిరణ్యాకశ్యపుడు బ్రహ్మను గురించి తపస్తుచేసి తనకు నరులవల్ల, స్త్రీపురుషులవల్ల, ఏ ఆయుధం వలనగానీ పగలు, రాత్రి, నేలపైనా, ఆకాశంలో ఎక్కడా మరణంలేని వరం పొందాడు. ఈ కారణంగా హిరణ్యకశ్యపుని వధించడానికి శ్రీమహావిష్ణువు బ్రహ్మవరాలకు అతీతంగా అవతారం ఎత్తవలసివచ్చింది. నడుము వరకు సింహం పంజాతో ఉండే విధంగా అవతరించి పగలు రాత్రికాని సాయం సమయంలో గుమ్మంపై కూర్చుని తన ఒడిలో హిరణ్యకశ్యపుని సింహం పంజాగోళ్ళతో కడుపు చీల్చి సంహరించాడు. ఆకారం మానవ, సింహరూపం కావడం వల్ల నారసింహావతారంగా పేరు వచ్చింది. ఈసందర్భాన్ని పురస్కరించుకొని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు బుధవారం షోడషబాహు నారసింహస్వామి ప్రతిమకు అభిషేకాలు, విశిష్ట పూజలు నిర్వహించడం జరుగింది. అహోబిలంలో అహోబిల నరసింహ స్వామి దేవాలయం, యాదగిరిగుట్టలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం, మాలకొండలో మాల్యాద్రి నరసింహస్వామి దేవాలయం, సింహాచలంలో నరసింహస్వామి దేవాలయం, ధర్మపురిలో శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయం, మంగళగిరిలో పానకాల లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం, పెంచలకొనలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, వేదాద్రిలో వేదాద్రినరసింహస్వామి దేవాలయం ఈతొమ్మిది దేవాలయాలు మన తెలుగు రాష్ట్రాల్లో నవనారసింహ క్షేత్రాలుగా వాసిగించాయి.



శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో భక్తులకు ముద్రధారణ చేస్తున్న పీఠాధిపతి

# తొలికరి వర్షాలతో దుక్కి కి సిద్ధమైన రైతులు

(మొదటి పేజి తరువాయి)

గంగులపాడు, రాగిమాన్ దోడ్డి, గవిగట్టు, పీకలబెట్టా, బాపులదొడ్డి, హులికన్వి, హనుమాపురం తదితర గ్రామాల్లోని రైతులు ఉదయం నుంచి తమతమ పంట పోలాలను దుక్కి దున్నుతూ మరికొందరు తమ పోలాల్లో పెంట ఎరువులను చల్లకోవడం వంటి పనుల్లో రైతులు కూలీలు నిమగ్నమైయ్యారు. అలాగే వర్షం కురవడం వలన అన్నాదాతలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అలాగే మరి కొందరు రైతులు వ్వవ సాయ బోర్లు బావుల. చెరువులు కింద ఉన్న వ్వవసాయ భూముల్లో పత్తి విత్తనాలు నాటుకోవడంలో ఇటు రైతులు. అటు వ్వవసాయా కూలీలు పనుల్లో నిమగ్న మయ్యారు. ఏది ఏమైనా భారీ వర్షాలు రాకతో అన్నాధాతలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటి పేజి తరువాయి)

3వ తేదీ వరకు, ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలుతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్లకు డీటీలను కేటాయించాలని డీఆర్వోను ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. 27 పరీక్షా కేంద్రాలలో 7,748 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 9.30నిమిషాల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు జరుగుతున్నందున సంబంధిత ప్రదేశాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంటర్ మొదటి సంవత్సరం 8,813మంది జనరల్ విద్యార్థులు, 537మంది ఒకేషనల్ విద్యార్థులు కలిసి మొత్తం 9,350మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నార న్నారు. రెండో సంవత్సరం సంబంధించి 3,933మంది జనరల్ విద్యార్థులు, 465మంది ఒకేషనల్ విద్యార్థులు కలిపి మొత్తం 4,398మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. మొదటి, రెండు సంవత్సరాలు కలిపి మొత్తం 13,748మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5.30గంటల వరకు రెండో సంవత్సరం పపరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పోలీస్ బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈసమావేశంలో డీఆర్వో పద్మజ, కమిషనర్ నిరంజన్‌రెడ్డి, డీవీఈఓ సునీత, డీఈఓ సుధాకర్‌రెడ్డి, డిఎంహెచ్ ఓ డాక్టర్ వెంకటరమణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా చక్రస్నానం

(మొదటి పేజి తరువాయి)



నిర్వహించారు. దిగువ అహోబిలంలో నరసింహ జయంతి సందర్భంగా 108 కళాశాల తో తినమంజనం నిర్వహించారు. ఉత్సవ మూర్తులైన శ్రీ ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మ వార్లకు ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు అర్చక బృందం అభిషేకం వేదమంత్రాల నడుమ నిర్వహించారు. ఈ నరసింహ జయంతి ఉత్సవాలలో పాల్గొనేం దుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.





# ప్రశాంత వాతావరణంలో జీవితం గడపండి..

నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి



ప్రజలకు పలు సూచనలు చేస్తున్న సీఐ శివకుమార్‌రెడ్డి

**బండిఆత్మకూరు, రూరల్ మేజర్‌న్యూస్ :** గ్రామాలలో ప్రజలు ప్రశాంత వాతవరణంలో జీవితం గడపాలని నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని శింగవరం గ్రామంలో పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. అనంతరం సీఐ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జూన్ 4వ తేదిన వెలువడే ఎన్నికల ఫలితాలపై హింసకు తావివ్వకుండా ప్రశాంతంగా ఉండాలని, అనవసర కేసులలో ఇరుక్కొని కుటుంబ జీవితాలను నాశనం చేసుకోకంటి అని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, హింసను ప్రేరేపించిన కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని రౌడీలకు, సస్పెక్టులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండిఆత్మకూరు ఎస్ఐ మల్లిఖార్జున, మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్, గోస్పాడు ఎస్ఐ నాగార్జునరెడ్డిలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓబీసీలతో దొంగాటాడుతున్న కాంగ్రెస్, బిజెపిలు

– బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

**ఆదోని, మేజర్ న్యూస్ :** కాంగ్రెస్, బిజెపి రెండు పార్టీలు అణగారిన వర్గాలు, న్యాయమైన డిమాండ్లపై మోసపూరితంగా దొంగాటాడుతూ, దోబూచులాడుతున్నాయని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శివన్నలు తీవ్రంగా విమర్శించారు. బుధవారం వారు మాట్లాడుతూ, తాము అధికారంలోకి వస్తే జాతీయ స్థాయిలో జనగణనతోపాటు సమగ్రకుల గణన చేయిస్తామని, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మొత్తం రిజర్వేషన్లు 50శాతం మించ కూడదనేఉద్దేశ్యంతో పరిమితిని ఎత్తేస్తా మని, ఓబీసీలకు సామాజిక న్యాయం చేస్తామంటూ, ఇంతవరకు ఓబీసీల గురించి పట్టించుకోని కాంగ్రెస్ అనడం ఏమాత్రం నమ్మశ క్యంగా లేదన్నారు. 77ఏళ్ల స్వాతంత్రానంతరం, 60ఏళ్ల కేంద్ర, రాష్ట్రాల్లో అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు చావు బ్రతుకుల మధ్య తనను తాను కాపాడుకోవడానికి, తిరిగి అధికారమే పరమవధిగా భావించి, ఈ ఎన్నికల ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓబీసీలకు హామీలను గుప్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కానీ రిజర్వేషన్ వర్గాలకు, ముఖ్యంగా ఓబీసీలకు కాం గ్రెస్ అమలు చేస్తామంటున్న హామీల గురించి, ఎందుకు మాట్లాడడం లేదో, ఆ హామీలను తాము కూడా అమలు చేస్తామని తమ మెని ఫెస్టోలో ఎందుకు చెప్పుకోలేకపోతున్నాయో అర్థం కావడం లేదన్నారు. జాతీయ స్థాయిలో ఓబీసీల ప్రధాన డిమాండ్లైన చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు, బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు, బీసీ మహిళకు సబ్ కోటానిస్తూ, మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ చేయడం, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం, బీసీల అభివృద్ధికి ప్రతిబంధకంగా ఉన్న క్రిమీలేయర్ విధానాన్ని ఎత్తేయడంపై రెండు పార్టీలుతమ ఎన్నికల మెనిఫెస్టోలలో పెట్టకుండా మౌనం వహించడం ఓబీసీలను మభ్య పెట్టి, మోసగించడానికేనని వారు ధ్వజమెత్తారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి

– డీఎల్‌డీవో అధికారి మురళీకళ్యాణి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో అధికారిణి మురళీకళ్యాణి

**బండిఆత్మకూరు, రూరల్ మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని సత్వరమే సమస్యను పరిష్కరించాలని మండల సచివాలయ సిబ్బందికి డీఎల్‌డీవో అధికారిణి మురళీకల్యాణి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం–1 ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్ళినప్పుడు మూవెమెంట్ రిజిష్టర్‌లో వ్రాయలని కోరారు. అనంతరం నూతనంగా నిర్మించిన సచివాలయంలో కార్యకలాపాలు కొనసాగించాలని పంచాయతీ కార్యదర్శి నటరాజ్‌కు సూచించారు. వీరితో పాటు వీఆర్వో ఏసుపాదం,సచివాలయ సిబ్బంది మహబూబ్ బాషా, జిక్రియ, ఆయేషా, మేఘశ్యాంచారి వున్నారు.



నీటిపైపులైన్‌ను పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ శ్రీనివాసులు

**త్రాగునీరు, పారిశుధ్యంపై జాగ్రత్త వహించండి .. ఈవోఆర్‌డీ శ్రీనివాసులు :** గ్రామాలలో త్రాగునీటి సమస్యలు, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఈవోఆర్‌డీ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఈర్నపాడు గ్రామంలోని పంచాయతీ కార్యదర్శులతో గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్, త్రాగునీటి సరఫరా ట్యాంకులతో పాటు పారిశుధ్య పనులను పరిశీలించారు. నీటిని నమునాలను తీసుకొని పరీక్షలు నిర్వహించి ప్రజల ఆరోగ్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీరితో పాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుకుమార్ పాల్గొన్నారు.

# పెసరవాయి గ్రామంలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**గడివేముల, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో బుధవారం నాడు పాణ్యం సీఐ నల్లప్ప, గడివేముల ఎస్ఐ బీ.టీ. వెంకటసుబ్బయ్య పోలీసు సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో పెసరవాయి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించడంజరిగిందన్నారు. గ్రామంలోని అనుమానిత ఇళ్ళలో సోదాలు నిర్వహించామన్నారు. శాంతి భద్రతల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లో ఈ సోదాలు నిర్వహించడం జరుగుతుందని ఎన్నికల లెక్కింపును దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, అసాంఘిక కార్యక్రమాలకు చోటు ఇవ్వకుండా ముందస్తుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లకు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని, ఎంతటివారినైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. మీ గ్రామంలో ఎవరైనా కొత్తవారు అనుమానాస్పదంగా తిరుగుతూ ఉంటే వెంటనే పోలీస్ లేదా డయల్ 100కు ఫోన్ చేసిన వెంటనే చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

## క్రైమ్ స్పాట్

# కలుగోట్ల గ్రామంలో కార్డెన్ సెర్చ్

సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. సురేష్ కుమార్ రెడ్డి



**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్:** జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో బుధవారం ఉదయం వెల్దుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. సురేష్ కుమార్ రెడ్డి వెల్దుర్తి ఎస్సై పి .చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని అనుమానిత ఇళ్ళలో సోదాలు నిర్వహించినట్లు ఎస్సై పి .చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇరు పార్టీల వారికి చెందిన వారితో ఎస్ఐ పి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల లెక్కింపును దృష్టిలో ఉంచుకొని గ్రామంలోని అల్లర్లు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అల్లర్లకు గొడవలకు పాల్పడితే వారిపైన కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ప్రశాంతంగా ఉండేలాగా ప్రతి ఒక్కరూ పోలీస్ అధికారులకు సహకరించాలని వారు కోరారు.

# మద్యం అమ్మేవారి ఇళ్లలో సోదాలు– రూరల్ సిఐ



కవాత్ నిర్వహిస్తున్న పోలీసులు

**ఆదోని రూరల్, మేజర్ న్యూస్ :** గ్రామాల్లో కర్ణాటక మద్యం అమ్మే వారి ఇళ్లలో సోదాలు, తనిఖీలు నిర్వహించినట్లు రూరల్ సిఐ నీరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ, డిఎస్పీ ఆదేశాల మేరకు ఇస్వీ, పెద్దతుంబళం గ్రామాల్లో ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ వీధులలో సిబ్బందితో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నలుగురు, ఐదారు మంది మీటింగులు నిర్వహించరాదని, ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే గ్రామంలో ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సాధారణ ఎన్నికల ఫలితాలు వచ్చేంతవరకు పెట్రోలు, డీజిల్ అమ్మకూడదని, లేనియెడల పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ దాడుల్లో రూరల్, ఇస్వీ, పెద్దతుంబళం పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇద్దరు మహిళలది హత్య– ఆటోడ్రైవర్ అరెస్టు



పోలీసుల అదుపులో డ్రైవర్ (ఫైల్‌ఫోటో)

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** కర్నూలు శివారులోని నగర వనం వద్ద లభించిన ఇద్దరు మహిళల శవాలు హత్యకు గురయ్యాయని కర్నూలు అడిషనల్ ఎస్పీ నాగరాజు తెలిపారు. బుధవారం నగరంలోని 4వ పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడించారు. నగర వనం లోని చెరువులో ఈ నెల 18వతేదీన లభించిన ఇద్దరు మహిళల శవాలు లభించాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఇద్దరు మహిళలు తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన అరుణ, జానకిలుగా గుర్తించారు. జానకి, అరుణలు కర్నూలును కేంద్రంగా చేసుకొని వేశ్య వృత్తి కొనసాగించేవారన్నారు. ఈ క్రమంలో వారికి కర్నూలు నగరానికి చెందిన ఆటోడ్రైవర్ మహబూబ్‌బాషతో పరిచయమైంది. అయితే గతంలో ఆటోడ్రైవర్‌కు జానకికి వచ్చిన మనస్పర్థాల జానకి ఆటోడ్రైవర్‌ను వేరే వ్యక్తులతో కొట్టించింది. దీనిని మనసులో పెట్టుకున్న ఆటోడ్రైవర్ ప్రతీకారం తీర్చుకోవాలని అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 18తేదీన ఇద్దరు మహిళలు గార్గేయ పురంలోని చెరువు వద్ద బట్టలు ఉతుక్కుంటుండగా జానకిని చెరువులో తోసేశాడు. జానకికి రక్షించబోయి అరుణ కూడా నీటిలో పడి మృతిచెందిందన్నారు. అప్పటి నుంచి పోలీసులకు కనిపించకుండా తిరుగుతున్న ఆటోడ్రైవర్‌ను పట్టుకొని బుధవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ విజయశేఖర్, కర్నూలు టుటౌన్ సీఐ ఇంతియాజ్‌బాష, కర్నూలు 4వ పట్టణ సీఐ శంకరయ్య, కర్నూలు తాలూకా సీఐ శ్రీధర్ పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్లు సీజ్

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** కర్నూలు మండలం మునగాలపాడు, జొహరాపురం ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న 8ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాజేందప్రసాద్ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 8ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్న 32టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకొని 8ట్రాక్టర్లను జప్తు చేసి రూ.90వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ ఇన్స్పెక్టర్ నరసనాయుడు, ఇంటెలిజెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెల్దుర్తిలో విత్తన దుకాణాల తనిఖీ..


స్టాక్ రిజిస్టర్లను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని శ్రీ బాలాజీ సీడ్స్ ఫెస్టిసిడ్స్, ధరణి ఫర్టిలైజర్స్, మన గ్రోమోర్ విత్తనాల దుకాణములను బుధవారం పత్తికొండ ఏడిఏ మోహన్ విజయ్ కుమార్, వెల్దుర్తి వ్యవసాయ శాఖ అధికారి అక్బర్ బాషా తనిఖీ చేశారు. అనంతరం దుకాణములో స్థాకు రిజిస్టర్లు, బిల్ బుక్స్ మరియు స్థాకు బోర్డ్స్ ను పరిశీలించడం జరిగిందని వారు పేర్కొన్నారు. దుకాణములో ఉన్న వివిధ కంపినీలకు చెందిన ప్రత్తి, కంది, ఆముదము మరియు కూరగాయల విత్తనాలను తనిఖీ చేయడము జరిగిందని తెలిపారు.రైతులకు విత్తనాలు విక్రయించేటప్పుడు తప్పనిసరిగా లాట్ నెంబరు మరియు ఇతర సమాచారాన్ని కనబర్చి బిల్ రసీదును రైతులకు ఇవ్వాలని షాపు యజమానులకు ఆదేశించారు.అనుమతి లేని విత్తనాలు రైతులకు అమ్మితే అట్టి వారి పై విత్తన చట్ట ప్రకారము కఠిన చర్యలు తీసుకొవడం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీ రేట్ల కంటే ఎక్కువ ధరకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

**వెల్దుర్తి మేజర్ న్యూస్ :** మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో సబ్సిడీ విత్తనాలను పత్తికొండ ఏడిఏ మోహన్ విజయ్‌కుమార్ వెల్దుర్తి వ్యవసాయ శాఖ అధికారి అక్బర్ బాషా రైతు భరోసా సిబ్బంది ప్రణీత బందే నవాజ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్సిడీపై విత్తనాలు కావలసిన రైతులు మండలంలోని అన్ని గ్రామాలలోని రైతుభరోసా కేంద్రాలను సంప్రదించి తీసుకోవాలన్నారు. సబ్సిడీపై వేరుశనగ విత్తనాల నమోదు కార్యక్రమాన్ని రైతు భరోసా కేంద్రం వెల్దుర్తి నందు ఏడిఏ విజయ్ మోహన్ పరిశీలించి వేరుశనగ విత్తనాన్ని రైతులకు పంపిణీ చేశారు. వేరుశనగ విత్తనాల సబ్సిడీ వివరాములు (క్వింటానికి) పూర్తి ధర రూ,9500,సబ్సిడీ రూ. 3800 (రాయితీ 40%) రైతు కట్టవలసిన వాటా రూ. 5700 రైతు, రైతు భరోసా కేంద్రానికి వచ్చేటప్పుడు వచ్చేటప్పుడు పట్టాదారు పాసు పుస్తకం మొబైల్ నెంబర్ ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.


వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడిఏ విజయ్ మోహన్ కుమార్

# జగన్ సీఎం కావాలని చండీయాగం


బి.వై.రామయ్య

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ ఈ నెల 24వతేదీన శ్రీ రాజశ్యామల చండీయాగం నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా వైసీపీ ఎంపీ అభ్యర్థి బి.వై.రామయ్య బుధవారం తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా, సకల వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్న వైసీపీ ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. శుక్రవారం ఉదయం 8.00గంటల నుంచి గణేష్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయం ఎదుట రాజ్యశ్యామల చండీయాగానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

# అవుకు ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా

**అవుకుమేజర్,న్యూస్:** అవుకు పట్టణంలోని ఐటిఐ కళాశాల యందు ఈ నెల 27వ తేదీన సోమవారం ఉదయం 10గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిఐ కళాశాలలో జరుగు జాబ్ మేళాకు 18 సంవత్సరాలు పూర్తి అయి పదవ తరగతి, ఐ.టి.ఐ, ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతి, యువకులు హాజరు కావాలన్నారు. ఈ జాబ్‌మేళాలో శిరిడి సాయి ఎలక్ట్రికల్స్ కడప, హోండా కంపెనీ కోలార్, ప్రీమియర్ ఎనర్జీ అండ్ ప్రవేట్ లిమిటెడ్ హైదరాబాద్, వేరియంట్ అప్లియన్సెస్ అండ్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ హైదరాబాద్, భగవతి ప్రొడక్ట్ లిమిటెడ్ హైదరాబాదు, రెన్యూజెస్ ప్రవేట్ లిమిటెడ్ హైదరాబాద్ కంపెనీలు పాల్గొంటున్నాయని అన్నారు. 18 సంవత్సరాలు పూర్తి అయిన పదవ తరగతి లేదా ఇంటర్‌తోపాటు కంప్యూటర్ నాలెడ్జి కలిగిన మహిళా అభ్యర్థులు కోలార్‌లో గల సెల్‌ఫోన్ అసెంబ్లీ యూనిట్ నందు ఉద్యోగాలు ఉన్నాయని అన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యేవారు విద్యార్హత సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ పత్రం, సెల్ఫ్ ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుబుక్కుజిరాక్సు, ఫోటోలతో హాజరు కావాలని అన్నారు.

# అంగరంగ వైభవంగా సుంకులమ్మ దేవర ఉత్సవం..

**శ్రీసుంకులమ్మ అవ్వను దర్శించుకున్న విరుపాక్షి..**


శ్రీసుంకులమ్మ అవ్వ సన్నిధిలో వైసీపీ అభ్యర్థి విరుపాక్షి

**చిప్పగిరి,మేజర్ న్యూస్ :** చిప్పగిరి మండలం నేమకల్లు మజారా గ్రామమైన సంగాలలో ఊరి దేవర ఉత్సవం అంగరంగ వైభవంగా ముగిసింది. గ్రామంలో కొలువైన శ్రీ మహా శక్తి మాత సుంకులమ్మ అవ్వ దేవరలో భక్తులు కుంభాలతో ఊరేగుతూ అమ్మ వారి సన్నిధికి చేరుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంట్లో దేవర ఉత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారిని ఆలూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరుపాక్షి, సోదరుడు శ్రీరాములు దర్శించుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు మహమ్మద్ రిజ్వాన్, ఓబులేసు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి భీమలింగ, సర్పంచ్ ప్రేమ్ కుమార్,బాబు,సుంకన్న లు పాల్గొన్నారు.


కుంభాలతో వెళ్తున్న భక్తులు

# ఆర్ఏహెచ్‌టీసీ శిక్షణ ముగింపు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** ఆర్ఏహచ్‌టీసీలో గత 45రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. కొత్తగా నియమితులైన అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లకు ఈ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ డాక్టర్ దుర్గాప్రసన్నబాబు, వీపీసీ డీడీ హేమంత్ కుమార్, విశ్రాంత జేడీ రామచంద్రయ్య, ఆర్ఏహెచ్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణ పొందిన వారు రైతు భరోసా కేందారల్లో రైతులకు ఉపయోగపడాలన్నారు. మూగజీవాలకు సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లూరు డివిజన్ అసిస్టెంట్ డైరక్టర్ పార్థసారధి, ఆర్‌హచ్‌టీసీ డాక్టర్ అరుణశ్రీ, రిసోర్స్ పర్సన్లు శ్రీకాంత్‌రెడ్డి, సతీష్‌కుమార్, స్వాతి, సునల్, అలీ, వెంకటసుబ్బయ్య, పద్మలత, మాధవి, భవానిశంకర్, సుభాన్‌బాష, రవికుమార్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.


శిక్షణ పొందిన సభ్యులు

# నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు

**– వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారి**


విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** విత్తన దుఖాణ యజమానులు నకిలీ విత్తనాలను విక్రయించి రైతులను మోసం చేసినా, అధిక ధరలకు విత్తనాలను విక్రయించిన అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ, మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్ రెడ్డిలు అన్నారు. బుధవారం పట్టణంలోని విత్తన దుఖాణాలను వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తన దుఖాణ దారులు గుర్తింపు పొందిన విత్తన కంపెనీలకు చెందిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని , అధిక ధరలకు విత్తనాలను విక్రయించరాదన్నారు. రైతుల అవసరాలను ఆసరగా చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తే అలాంటి షాపు లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. విత్తనాలను కొనుగోలు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని అన్నారు. విత్తన దుఖాణ దారులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే అలాంటి షాపులపై చర్యలు తీసుకొని షాపు లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు.

# అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు.. సీఐ విజయభాస్కర్


సిబ్బందితో కలిసి కవాతు నిర్వహిస్తున్న సీఐ విజయ్‌భాస్కర్

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** మిడ్తూర్ మండలంలోని మాసాపేట, కలమందలపాడు, ఉప్పలదడియ గ్రామాలలో పోలీస్ కవాతు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులతో కవాతు నిర్వహించారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 6వ తేది వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని సార్వత్రిక ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా జరిగాయని అలాగే జూన్ 6, ఎన్నికల ఫలితాల వరకు గ్రామాలలో ప్రశాంతంగా ఉండాలని అప్పటివరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని కావున ఎంతటివారైనా సరే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో ప్రజలు ఎటువంటి ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ ప్రకాశ్‌కుమార్, మిడ్తూరు ఎస్ఐ జగన్‌మోహన్ యాదవ్, జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మినారాయణ, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ నాగార్జున ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్, ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది తదితరులు కవాతు నిర్వహించారు.

# పుష్పపల్లకి వేడుకల్లో పాల్గొన్న శెట్టి విజయ్ కుమార్

**స్వామి వారి పల్లకి సేవలో పాల్గొనడం సంతోషంగా ఉంది..**

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** అహోబిలంలో జరుగుతున్న లక్ష్మీ నరసింహస్వామి వైశాఖమాస నృసింహ జయంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం కార్యక్రమంలో స్వామి, అమ్మవార్లను రథంపై పుష్ప పల్లకిలో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. స్వామివారి పల్లకి సేవలో శెట్టి విజయకుమార్ పాల్గొన్నారు. బుధవారం ఎగువ అహోబిలంలో స్వామివారికి చక్రస్నానం, దిగువ అహోబిలంలో శ్రీ నరసింహ స్వామి జయంతి 108 కలశ తిరుమంజనం ఆలయ అర్చకులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ నిత్య అన్నదాన సత్రం అధ్యక్షుడు, బలిజ సంఘం నేత శెట్టి విజయకుమార్, సతీమణి లక్ష్మీదేవి, బద్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, టిడిపి ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గూడూరు సంజీవరాయుడు, అంగం శివ రాయల్(జర్నలిస్ట్) తదితరులు నరసింహ స్వామి వారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శెట్టి విజయ్ కుమార్ మాట్లాడుతూ స్వామి వారి పల్లకి సేవలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. స్వామి వారి ఆలయ అభివృద్ధికి తనవంతుగా సహాయ, సహకారం అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మనోజ్, సంతోష్, హరి, బండి రామచంద్రుడు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న శెట్టి విజయ్ కుమార్

# రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష



రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ శ్రీనివాసులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు రాజకీయ పార్టీ ప్రతినిధులతో అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. వచ్చేనెల 4వ తేదీ ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రపారంభమైన అరగంట అనంతరం ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుళ్లు ఉంటాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో భాగంగా మూడు టేబుళ్ళను సర్వీస్ ఓటర్లకు ప్రత్యేకంగా కేటాయిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ఏజంట్ల పాసుల జారీకి సంబంధించి ఈనెల 27వ తేదీలోగా కౌంటింగ్ ఏజంట్ల వివరాలను ఫారం-18 ఇవ్వాలని కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఒక్కొక్క పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్ వద్ద ఒక సహాయ రిటర్నింగ్ అధికారిని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజంట్లు మొబైల్ ఫోన్లను కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించమన్నారు. జూన్ 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు144సెక్షన్ అమలులో ఉంటుందని నలుగురుకు మించి వ్యక్తులు ఎవరు గుమికూడి ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని కలెక్టర్ తెలిపారు. బాణసంచా సామాగ్రిని విక్రయాల నిమిత్తం తహశీల్దార్ నుంచి ముందుగానే అనుమతులు పొంది ఉండాలని కలెక్టర్ వెల్లడించారు. ఈసమావేశంలోడీఆర్వోపద్మజ, అన్నిరాజకీయపార్టీలప్రతినిధులు పాల్గొన్నారు.

# 24నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐఓ గురువయ్యశెట్టి

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆర్ఐఓ గురువయ్యశెట్ట తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. కర్నూలు జిల్లాలో ఈ నెల 24వతేదీ నుంచి జరిగే ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు 35పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందులో మొదటి సంవత్సరానికి 35పరీక్ష కేంద్రాలు, ద్వితీయ సంవత్సరానికి 22పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలను 15,981మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం పరీక్షలను 6,962మంది విద్యార్థులు రాస్తున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9.00గంటల నుంచి 12.00 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరుగుతాయన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీకెమెరాలు, తాగునీటి వసతి, టాయిలెట్స్ ఏర్పాటు చేశామన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు, మాల్ ప్రాక్టీస్ జరుగకుండా రెండు ప్లైయింగ్ బృందాలు, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, డీఈసీ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

# లెక్కింపు రోజు విధ్వంసాన్ని అడ్డుకునేందుకు పోలీస్ వ్యూహం

- గోనెగండ్ల ఫ్యాక్షన్ గ్రామాల్లో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్
- అనుమానితు ఇండ్లలో సోదాలు
- మారణాయుదాల పై ప్రత్యేక నిఘా
- పెట్రోల్ బంకుల్లో బాటిళ్ల, క్యాన్లకు అమ్మకాలు నిషేదం
- పెట్రోల్ బంకు యజమానులకు నోటీసును జారీ



గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:**ఓట్ల లెక్కింపు రోజు గ్రామాలలో అల్లర్లు జరుగుతాయనే అనుమానం రావడం. అందుకు అధికార పార్టీ నాయకులు అనుమానం కలిగే విధంగా నడుచుకుంటు ఎండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అందులో బాగంగా పోలీసులు బుధవారం మండలాల్లోని ప్యాక్షన్ గ్రామాలలో కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో అనుమానితుల గృహాలు, పశువుల పాకలు, గట్టివాములలను, ఫ్యాక్షన్ మనస్థత్వం కలవారి ఇండ్లలో సోదాలు చేస్తున్నారు. బుధవారం గోనెగండ్ల మండల పరిధిలోని ప్యా క్షన్ గ్రామమైన కున్నూరులో కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్, అనుమానిత ఇండ్లలో పోలీసులు సోదాలు చేశారు. గ్రామంలోని విదులలో పర్యటించి గ్రామస్థులకు ఓట్లు కౌటింగ్ రోజు అల్లర్లు పరస్పర దాడులకు పాల్పడకుండా అవగాహన కల్పించారు. ఓటింగ్ తరువాత జిల్లాలో కొన్ని చోట్ల గొడవలు, హత్యయత్నాలు జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కౌంటింగ్ రోజు గ్రామాలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గాను ముందస్తు గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు గోనెగండ్ల సీఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో అనుమానిత ఇండ్లలను సోదాలు చేస్తామని తెలిపారు. సమస్యాత్మక గ్రామ కూడళ్ల లో సైతం గ్రామస్థులు గుంపులు గా ఉండరాదని పోలీసులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. గ్రామాలలో అనుమానితుల ఇండ్లలో కత్తులు, బరిసెలు, ఇనుప రాడ్లు, కర్రలు వేలుడు పదార్థాలు, మద్యం నిలువలును సర్వ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గోనెగండ్ల మండలంలోని పలు గ్రామాలలో కార్టన్ అండ్ సర్చ్ ఆపరేషన్ చేపడతున్నామని అనుమానం వస్తే ఎంతటివారినైన వదిలేదిలేదని సీఐ తెలిపారు. బాటిళ్లు లో పెట్రోల్ అమ్మకాలపై బంకు యజమానులకు నోటీసులు జారీ రాష్ట్రంలో కొన్ని చోట్ల పెట్రోల్ బాంబుల తయారుచేసి విధ్వంసం కు పాల్పడుతుండటం తో ఈసీ, ఉన్నత స్థాయి పోలీసు అధికారుల ఆదేశాల మేరకు గోనెగండ్ల మండలంలోని నాలుగు పెట్రోల్ బంకు యజమానులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. కాలీ బాటిళ్లకు, క్యాన్లులలో పెట్రోల్ పోయరాదని కేవలం వాహనాలకు మాత్రమే పెట్రోల్ పోయాలని నోటీసులలో పెర్కొన్నారు. ఆదేశా లను ఉల్లగించి అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పెట్రోల్ బంబులు తయారు చేసి కొన్ని ప్రాంతాలలో అల్లర్లు పెరిగి పోవడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఆదేశాలను ఉల్లంగించి బాటిళ్లకు, క్యాన్లకు పెట్రోల్ నింపితే బంకు లైసెన్ కూడా రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పెట్రోల్ బంక్ యాజమాన్యం బాటిళ్లకు పెట్రోల్ కూడా మానేశారు. అయితే కొంతమంది వాహదారులు పెట్రోల్ బాటిల్ లోకి పొయ్యాలని తమ బండ్లు రోడ్డుపై ఆగిపోయాయని పెట్రోల్ బంక్ యాజమాన్యం పై గొడవ దిగుతున్నారు.దీంతో పెట్రోల్ బంకు యజమానులు పోలీసులు ఇచ్చిన నోటీసును జీరాక్స్ చేయించి బోర్డులో అతికించారు. అడిగిన వారికి నోటీసుబోర్డులో ఉన్న నోటీసును చూడమని చెపుతున్నారు.



పెట్రోల్ బంకు యజమానికి నోటీసు జారీ చేస్తున్న పోలీసులు

## గొంతు వాపు వ్యాధి నుండి పశువులను రక్షించుకోండి

**అవుకుమేజర్,న్యూస్:** పశువులకు గొంతువాపు వ్యాధి టీకాను వేయించి పశువులను కాపాడుకోవాలని పాడి పరిశ్రమ రైతులకు మండల పశు వైద్యాధికారి డాక్టర్ భారతీదేవి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతము గొంతు వాపు వ్యాధితో పశువులు చనిపోయే ప్రమాదం ఉందని కావున తమ పశువులకు గొంతు వాపు నివారణ టీకా వేయించుకోవాలని అన్నారు. మీ పశువులను ఇంటి దగ్గర ఉంచుకోవాలని పశువైద్య సిబ్బంది మీ ఇంటి వద్దకే వచ్చి పశువులకు టీకాలు వేస్తారని అన్నారు. పశువులకు వ్యాధి వచ్చిన తరువాత నివారణకు చాలా ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతాయని ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని కావున రైతులు తమ పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని అన్నారు. మే నెలలో వర్షాలు మొదలు కావడంతో నంద్యాల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పశువులకు గొంతు వాపు వ్యాధి వలన చనిపోవడం జరిగిందని అన్నారు. కావున పశుపోషకులు పశువైద్యశాల మరియు గ్రామీన పశు వైద్యశాలకు వెళ్లి వైద్య సిబ్బందిని కలిసి తమ పశువులకు గొంతు వాపు నివారణ వ్యాధి టీకా వేయించుకోవాలన్నారు.

# ప్రగతి పథంలో ఖిద్‌మత్ సొసైటి



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ప్రగతి పథంలో ఖిద్‌మత్ సొసైటి దూసుకుపోతుంది. నంద్యాలలో ఖిద్‌మత్ సొసైటి స్థాపించిన 20 నెలల్లో వెయ్యి మందికి రూ. 6 కోట్ల రుణాలు ఇచ్చి ప్రగతి పథంలో దూసుకుపోతున్నట్లు సొసైటి అధ్యక్షులు నవాజ్ ఖాన్ తెలిపారు. బుధవారం మూలాన్ పట్టీలోని ఖిత్మత్ సొసైటి బిఎల్‌పి సమావేశం నవాజ్‌ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల సొసైటిలో 1200 మంది సభ్యులు ఉన్నారన్నారు. వడ్డీ రహిత రుణాలు పేద వ్యాపారులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందుతున్నారన్నారు. హజ్, ఉమ్రా తదితర తీర్థ యాత్రలకు వెళ్ళే వారు ప్రత్యేక పర్సనల్ ఖాతాల ద్వారా వారు యాత్రలు చేయవచ్చునన్నారు. అనంతరం సొసైటి కార్యదర్శి, బిల్డర్ అబ్దుల్లాకు జమాతే ఇస్లామి హింద్ నంద్యాల అధ్యక్షులు అబ్దుల్ సమ్మద్ శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సొసైటి కార్యవర్గ సభ్యులు ఘనంగా వీడ్కోలు తెలిపారు. ముస్లిం జీవితంలో హజ్ పవిత్ర యాత్ర ముఖ్యమైన ఘట్టమన్నారు. ప్రపంచ మానవాళి కోసం, మన దేశం కోసం ప్రజలు ప్రార్థించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బోర్డు కార్యదర్శి షబ్బీర్ హుసేన్, డైరెక్టర్లు అబ్దుల్ సమ్మద్, హఫీజ్ మహమ్మద్, సోయబ్, జమాన్, ముస్తఫా, బిఎల్‌సి కార్యదర్శి అబ్దుల్ నబీ, సలీం, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఏ.కోడూరులో చేతిరాత నైపుణ్య శిక్షణ కార్యక్రమం

**బండిఆత్మకూరు, రూరల్ మేజర్‌న్యూస్ :** నేటి నుంచి ఏ.కోడూరులో నాలుగు రోజుల పాటు చేతిరాత మెరుగుదలపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏ.కోడూర్ అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యుడు మన్నెకుమార్ తెలిపారు. స్థానిక స్పెషల్ పాఠశాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు హైదరాబాదు నుండి క్యాలిగ్రఫి నిపుణులు గ్రేస్ చేత శిక్షణా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 4వ తరగతి పైబడిన విద్యార్థులు నుండి గృహిణులు కూడా ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని చేతిరాతను మెరుగుదల చేసుకోవచ్చునని విద్యార్థులకు అవసరమయ్యే సామాగ్రిని అంబేద్కర్ కమిటీ ఉచితంగా అందజేస్తుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, మహిళలు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.

# మానవతా సేవలో మమేకం కావాలి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని శ్రీరామకృష్ణా డిగ్రీ కళాశాలలో బుధవారం హెచ్ఐవి పాజిటివ్ బాధిత చిన్నారులకు పౌష్టికాహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఉమామహేశ్వరరావు, విద్యాభారతి సంస్థల కార్యదర్శి సూర్యనారాయణలు పాల్గొన్నారు. వైఆర్‌జికేర్ ప్రాజెక్ట్ ఆక్యులరేట్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక సేవలో ప్రముఖులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి ఎంతో సేవాతత్పరతతో బాధిత చిన్నారులకు 50మందికి ఉచితంగా మందులు, పౌష్టికాహారం అందజేయడం గొప్ప విషయం అన్నారు. రెండేళ్ళ నుంచి బాధితులకు అందజేయడం అభినందించదగ్గ విషయమన్నారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దైవ గుణం మనతో ఇలాంటి సహాయ సహకారాలు చేసినప్పుడు ఎంతో ఆత్మతృప్తి కలుగుతుందని తెలిపారు. సమాజం పట్ల దేశం పట్ల గౌరవం ఉన్నప్పుడు మనం ఇలాంటి సేవా కార్యక్రమాలకు ఎప్పుడు ముందుకు వస్తామని హెచ్ఐవి పాజిటివ్ బాధిత చిన్నారులు వాళ్ళకు తెలియకుండానే వ్యాధికి గురయ్యారన్నారు. ఈకార్యక్రమంలో హెచ్ఐవి పాజిటివ్ బాధిత చిన్నారుల తల్లిదండ్రులకు మందులు పౌష్టికాహార సరుకులు అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రసాద్, సుధారాణి, సుజాత, నాగమణి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.




హెచ్ఐవి బాధిత చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ ఉమామహేశ్వరరావు

# APPSC Group -1 Prelims General Studies

# జనరల్ మెంటల్ ఎబిలిటి

**పార్ట్ - ఎ**

**జనరల్ మెంటల్ ఎబిలిటీ, అడ్మినిస్ట్రేటివ్ మరియు సైకలాజికల్ ఎబిలిటీస్**

(గత వారం తరువాయి...)

48. ఈ క్రింది దత్తాంశ మధ్యగతాన్ని కనుగొనండి. (రెండు దశాంస స్థానాలకు సవరించండి).

| వేరియబుల్స్ | పౌన:పున్యం |
|---|---|
| 15-25 | 4 |
| 25-35 | 11 |
| 35-45 | 19 |
| 45-55 | 14 |
| 55-65 | 0 |
| 65-75 | 2 |

1. 39.26 2. 40.26
3. 41.56 4. 42.65

49. ఈ క్రింది చిత్రంలో త్రిభుజాల సంఖ్యను కనుగొనండి :



1. 36 2. 32
3. 48 4. 52

50. ఎ,బి,సి,డి.ఇ,ఎఫ్ మరియు జి అనే పేరుతో ఉన్న ఏడుగురు అబ్బాయిలలో ప్రతి ఒక్కరికి వారంలోని వేర్వేరు రోజున పరీక్ష ఉంటుంది. ఆదివారం నుండి ప్రారంభమై అదే వారంలోని శనివారం ముగుస్తుంది. సి మరియు ఏ లకు మధ్య కేవలం ఇద్దరు వ్యక్తులకు మాత్రమే వారి పరీక్ష కలదు. బి తక్షణ ముందు ఇ కు పరీక్ష కలదు. సి తక్షణ ముందు ఎఫ్ కు పరీక్ష కలదు. ఎ తర్వాత జి కు మాత్రమే పరీక్ష ఉంటుంది. ఈ క్రింది ఎంపికలలో ఏది అబ్బాయి యొక్క సరైన జతను మరియు అతని పరీక్ష రోజుని సూచిస్తుంది?
1. ఎ - గురువారం
2. జి - శుక్రవారం
3. సి - మంగళవారం
4. బి - సోమవారం

51. కింది ధృవీకరణ (ఎ) మరియు కారణం (ఆర్)లను పరిగణించండి మరియు సరైన కోడ్‌ను ఎంచుకోండి.
ధృవీకరణ (ఎ) - ఎబి పాజిటివ్ బ్లడ్ గ్రూప్ ఉన్న వ్యక్తిని యూనివర్సల్ రిసీపియెంట్ అంటారు.
కారణం (ఆర్) -
ఎబి పాజిటివ్ బ్లడ్ గ్రూప్ ఉన్న వ్యక్తికి ప్లాస్మాలో ఎ & బి యాంటిజెన్‌లు మరియు యాంటీబాడీలు ఉన్నాయి.
కోడ్ -
1. (ఎ) మరియు (ఆర్) సరైనవి మరియు (ఎ) యొక్క సరైన వివరణ (ఆర్).
2. (ఎ) మరియు (ఆర్) సరైనవి, కాని (ఎ) యొక్క సరైన వివరణ (ఆర్) కాదు.
3. (ఎ) నిజం, అయితే (ఆర్) తప్పు
4. (ఎ) మరియు (ఆర్) రెండూ తప్పు

52. ఈ దిగువ ప్రశ్నలో ఇవ్వబడిన నాలుగు ప్రత్యామ్నాయాలు ఎ,బి,సి మరియు డిలో మాత్రకను పూర్తి చేసే సరైన సమాధాన చిత్రాన్ని ఎంచుకోండి.




ఇటీవల కాలంలో APPSC,TSPSC ప్రశ్నాపత్రాలో కాన్సెప్ట్‌బేస్డ్ ప్రశ్నలు ఎక్కువగా వస్తున్నాయి. 17-3-2024న జరిగిన Group-I ప్రశ్నాపత్రంలోని జనరల్ మెంటల్ ఎబిలిటి,అడ్మినిస్ట్రేటివ్ మరియు సైకలాజికల్ ఎబిలిటీ ప్రశ్నలను, జవాబులను ప్రజ్ఞ పాఠకుల అవగాహన కొరకు అందిస్తున్నాం.




1. బి 2. డి
3. సి
4. పై చిత్రాలు ఏవీ మాతృకను పూర్తి చేయలేవు.

53. 63 కి.మీ./గం వేగంతో ప్రయాణించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 199.5 మీటర్ల పొడవు ఉన్న విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్‌ను 21 సెకన్లలో దాటగలదు. 157 మీటర్ల పొడవు మరియు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కి వ్యతిరేక దిశలో గంటకు 54 కి.మీ./గం వేగంతో ప్రయాణిస్తున్న దూరంతో ఎక్స్‌ప్రెస్ పూర్తిగా దాటడానికి (వారు కలిసిన క్షణం నుండి) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఎంత సమయం పడుతుంది?
1. 8 సెకన్లు
2. 10 సెకన్లు
3. 12 సెకన్లు
4. 16 సెకన్లు

54. ఈ క్రింది బార్ చార్ట్‌ని అధ్యయనం చేసి క్రింద ఇవ్వబడిన ప్రశ్నకు సమాధానం ఇవ్వండి. 2024లో వివిధ ఐఐటి ల నుండి బి.టెక్. పరీక్షకు హాజరైన మరియు ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్యను చార్ట్ చూపుతుంది.
భారతదేశంలోని వివిధ ఐఐటిల నుండి బి.టెక్. పరీక్షకు హాజరైన మరియు ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య
ఐఐటి కాన్పూర్ మరియు ఐఐటి పూణే నుండి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య ఐఐటి మద్రాస్, ఐఐటి తిరుపతి మరియు ఐఐటి బాంబే నుండి పరీక్షకు హాజరైన విద్యార్థుల సగటు సంఖ్యలో




ఎంత శాతం? (వరుసక్రమంలో)
1. 60% మరియు 85%
2. 64% మరియు 90%
3. 65% మరియు 75%
4. 62% మరియు 90%

55. ఈ క్రింది ఇచ్చిన ప్రకటనలను మరియు తీర్మానాలను చదవండి. ఇచ్చిన ప్రకటనల నుండి తార్కికంగా అనుసరించే తీర్మానాలను ఎంచుకోండి.
ప్రకటనలు -
ప్రొఫెసర్లందరూ వైద్యులు
వైద్యులందరూ ఇంజనీర్లే.
కొందరు ప్రొఫెసర్లు లాయర్లు.
తీర్మానాలు -
1. ప్రొఫెసర్లందరూ ఇంజనీర్లు
2. ఇంజనీర్లందరూ లాయర్లు
3. కొందరు వైద్యులు లాయర్లు.
1. తీర్మానం 1 మాత్రమే అనుసరిస్తుంది.
2. తీర్మానాలు 1 మరియు 3 మాత్రమే అనుసరిస్తాయి.
3. తీర్మానాలు 1 మరియు 2 మాత్రమే అనుసరిస్తాయి.
4. తీర్మానాలు 2 మరియు 3 మాత్రమే అనుసరిస్తాయి.

56. మీరు సార్వత్రిక ఎన్నికలు 2024లో ఒక పోలింగ్ స్టేషన్‌కు పోలింగ్ అధికారి అని మరియు మావోయిస్ట్ ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఆ పోలింగ్ బూత్ ఉందని భావించండి. పోలింగ్ రోజున మావోయిస్టుల బృందం వచ్చి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తూ తుపాకులతో కాల్పులు జరిపి కార్యకలాపాలకు అంతరాయం కలిగించేందుకు ప్రయత్నించారు. అపుడు మీరు ఏమి చేస్తారు?
1. వెంటనే పోలింగ్‌ను ఆపివేసి, సంఘటన గురించి మీ ఉన్నతాధికారులకు తెలియజేయడం
2. పోలీసులను అదనపు బలగాలను సమకూర్చుకొని అక్కడ ఉన్న మావోయిస్ట్‌లను ప్రతిఘటించమని కోరడం.
3. అక్కడ ఉన్న పోలీసు బలగాలకు తెలియజేయడం మరియు ముఖ్యమైన పత్రాలు మరియు ఇవిఎమ్‌ల భద్రత నిర్ధారించమని వారిని కోరడం.
4. మావోయిస్టులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయమని మీక్రింది స్థాయి అధికారులను మరియు ఓటర్లను అడగడం.

57. r వ్యాసార్థం గల ఒక వృత్తం 2p చుట్టుకొలత గల బహుభుజి యొక్క అన్ని వైపులు nని తాకితే, అపుడు ఆ బహుభుజి యొక్కవైశాల్యం ఎంత అవుతుంది?
1. p+n/2r
2. (p-n)r
3. (2p-n) r
4. pr

58. ఒక రిక్రియేషన్ క్లబ్‌లో సాచ్, గౌతమ్, నగేష్, దీపక్ మరియు అనువ్ పేకాట ఆడుతున్నారు. సాచ్ గౌతమ్‌తో ఇలా అంటాడు. నువ్వు నాకు మూడు కార్డులు ఇస్తే నీ వద్ద అనూవ్ తో సమానంగా మరియు నేను నీకు మూడు కార్డ్‌లు ఇస్తే నీ వద్ద దీపక్‌తో సమానంగా కార్డులు ఉంటాయి. సాచ్ మరియు గౌతమ్ ఇద్దరి దగ్గర కార్డ్‌లు కలిపితే అవి దీపక్ మరియు అనూవ్ ఇద్దరి దగ్గర ఉన్న కార్డ్‌లు కంటే 10 ఎక్కువ ఉన్నాయి. నగేష్ దగ్గర ఉన్నదానికంటే గౌతమ్ దగ్గర రెండు కార్డ్‌లు ఎక్కువ ఉంటే మరియు మొత్తం కార్డ్‌ల సంఖ్య 133 అయితే, గౌతమ్ దగ్గర ఎన్ని కార్డ్‌లు ఉన్నాయి?
1. 35 2. 45
3. 20 4. 25

59. కింది ప్రశ్నలో చిత్రం (ఎ), ఈ దిగువన ఉన్న ప్రత్యామ్నాయ పి, క్యూ ఆర్, మరియు యస్ చిత్రాలలో ఎందులో భాగంగా ఉందో మీరు కనుగొనండి.




1. P 2. Q
3. R 4. S

60. ఒక నిర్దిష్ట కోడ్ భాషలో బీహార్‌ను ఉత్తరప్రదేశ్‌గా, ఉత్తరప్రదేశ్‌ను పంజాబ్‌గా, పంజాబ్‌ను అస్సాంగా, అస్సాంను గోవాగా, గోవాను బెంగుళూరుగా మరియు బెంగుళూరును సిక్కింగా కోడ్ చేస్తారు. అయితే భారత ప్రధాని ఇటీవల ఏ రాష్ట్రంలో ఎయిమ్స్‌ను ప్రారంభించారు?
1. గోవా
2. అస్సాం
3. పంజాబ్
4. బీహార్

**జవాబులు :**

| | | | | |
|---|---|---|---|---|
| 48)1 | 49)1 | 50)2 | 51)1 | 52)2 |
| 53)4 | 54)4 | 55)4 | 56)2 | 57)3 |
| 58)3 | 59)4 | 60)3 | | |

# నేడు లక్ష్మీచెన్నకేశవుని రథోత్సవం

– శేషవాహనం పై చెన్న కేశవుడు



శేషవాహనంపై చెన్నకేశవుని మనోహర దృశ్యం

మిద్దూరు, మేజర్‌న్యూస్ : మిద్దూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి వారి ఉత్సవాలలో చైత్రశుద్ధ చతుర్దశి బుధవారం నాడు శేశవాహనంపై చెన్నకేశవున్ని ఊరేగిం చారు. ఈ యొక్క ఉత్సవాలను నిర్వహిస్తున్న ట్లు ఈవో వెంకటరమణ తెలిపారు. బుధ వారం నాడు ఉత్సవాల సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుని శేశవాహనంపై భక్తి శ్రద్ధలతో మరియు మంగళ వాయిద్యా లతో వేద మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణలో చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణమంతా మారుమ్రోగింది. అనంతర ం పురవీధుల గుండా శేశవాహనంపై అర్చ కుడు వెంకటరామయ్యశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని ఊరేగించారు. పురవీధులలో ఊరేగిస్తూ భక్తులు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి హారతు లు సమర్పించారు. రాత్రి గరుడోత్సవ కార్యక్ర మం జరుగునని ఆలయ అధికారులు తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

**నేడు చెన్నకేశవుని రథోత్సవం :** గురువారం నాడు శ్రీ లక్ష్మీచెన్నకేశవుని రథోత్సవ కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వెంక టరమణ తెలిపారు. ఉదయం రథంగ హోమ ం, పూర్ణాహుతి కార్యక్రమం, సాయంత్రం ఐదున్నర గంటలకు శ్రీ లక్ష్మిచెన్నకేశవస్వామి రథోత్సవ కార్యక్రమం జరుగును. అనంతరం కీర్తిశేషులు బన్నూరు చిన్న వెంకటరెడ్డి లక్ష్మిదేవమ్మ వారి కుటుంబ సభ్యులచే ప్రసాద వితరణ జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అశేష సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈవో, గ్రామ పెద్దలు కోరారు.

## ఈవీఎంలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

– టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న గుడిసె కృష్ణమ్మ

ఆదోని, మేజర్ న్యూస్ : ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు పోలింగ్ రోజు బూతుల్లోకి వెళ్ళి ఈవీఎంలపు ధ్వంసం చేసిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని. భవిష్య త్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా శాశ్వతం గా అనర్హత వేటు వేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ పేర్కొన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికలు సజావుగా జరుగు తున్నాయా లేదా తెలుసుకునేందుకు ఎమ్మె ల్యే, ఎంపి అభ్యర్థులు రాచమార్గంగా పోలింగ్ బుతులోకి వెళ్లే అధికారాన్ని రాజ్యాంగాన్ని అనుసరించి ఎన్నికల కమీషన్ కల్పించిందన్నారు. బుతులోకి వెళ్ళి ఓటింగ్ సరళిని, తదితర విషయాలను పరిశీలించా లేగాని, ఈవీఎంలను ధ్వంసం చేయడాన్ని సరికాదన్నారు. ఎన్నికల రోజు అభ్యర్థులు ఎక్కడైనా ఇటువంటి ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొని వారిపై అనర్హత వేటు వేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# విత్తన దుకాణాలను ఆకస్మిక తనిఖీ



దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏఓ ప్రసాదరావు

నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్ : నంద్యాల మండలంలోని విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఆకస్మికం గా తనిఖీ చేశారు. బుధవారం మండల వ్యవ సాయ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో విత్తన దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా విత్తన దుకాణాలలో స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్‌లు, పలు పత్రాలను తనిఖీ చేయడంతోపాటు దుకాణాల స్టాక్ రిజిస్టర్, గ్రౌండ్ బ్యాలెన్స్ సరిగ్గా ఉన్నాయా లేదా అని పరిశీలించడం జరిగిందని ప్రసాదరావు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా కిరణ్ హైబ్రిడ్స్ నందు 5, ధరణి సీడ్స్ నుంచి 5 విత్తన నమూనాలను తీసి వాటి నాణ్యతా ప్రమాణాలను తెలుసుకునేందుకు ప్రయోగ శాలకు పంపామన్నారు. అదే విధంగా అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, ప్రతి దుకాణదారుడు సరైన ధృవ పత్రాలు కలిగి ఉండటంతోపాటు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించరాదని, విత్తనం కొన్న ప్రతి రైతుకు రశీదు తప్పని సరిగ్గా ఇవ్వాలన్నారు. స్టాక్ బోర్డు ప్రతిరోజు అప్‌డేట్ చేయాలని విత్తన దుకాణదారులను హెచ్చరించారు.

## బ్రహ్మ ముహూర్తం విలువైనది..ఈ కాలాన్ని వృథా చేయకూడదు

–ఈ ముహూర్త కాలంలో చేసే కార్యాలు దిగ్విజయమౌతాయి
–పూర్వం కాలాన్ని ఘడియలలో లెక్కించేవారు

మంత్రాలయం మేజరున్యూస్: బ్రహ్మ ముహూర్తం విలువైనది..ఈ కాలాన్ని వృథా చేయకూడదు.ఈ ముహూర్త కాలంలో చేసే కార్యాలు దిగ్విజయమౌతాయి. పూర్వం కాలాన్ని ఘడియలలో లెక్కించేవారు. ఒక ఘడియకు ప్రస్తుత కాలమానం ప్రకారం 24 నిమిషాలు. ఒక ముహూర్తం అనగా 2 ఘడియల (అంటే 48 నిమిషాలు) కాలమని అర్థం. ఒక పగలు, ఒక రాత్రి కలిపిన మొత్తాన్ని అహోరాత్రం అంటారు. ఒక అహోరాత్రంకు 30 ముహూర్తాలు ఉంటాయి. అనగా ఒక రోజులో 30 ముహూర్తాలు ఉంటాయి. సూర్యోదయానికి ముందు వచ్చే ముహూర్తాలలో మొదటిదాన్ని 'బ్రహ్మ ముహూర్తం' అంటారు. ఈ ముహూర్తానికి అధిదేవత బ్రహ్మ కావున దీన్ని బ్రహ్మ ముహూర్తం అన్న పేరు వచ్చింది. వాస్తవంగా తెల్లవారుజామును రెండు భాగాలుగా విభజించడం జరిగింది. సూర్యోదయానికి రెండు ఘడియల (48 నిమిషాలు) కాలాన్ని అసురీ ముహూర్తం అంటారు. ఈ అసురీ కాలమని దీనికి ముందు రెండు ఘడియల(48 నిమిషాలు) కాలాన్ని బ్రహ్మముహూర్తం అంటారు. ప్రతిరోజూ బ్రహ్మముహూర్తంలో నిద్రలేచి భగవంతుని ధ్యానించి పనులు ప్రారంభించాలని పెద్దలు చెబుతుంటారు. బ్రహ్మముహూర్తానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా నూతన గృహప్రవేశాలకు ఈ సమయాన్ని ఎన్నుకుంటారు. ఈ సమయంలో మానవుని మేథాశక్తికి భగవంతుని శక్తి తోడౌతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. కశ్యపబ్రహ్మ, వినత దంపతులకు అనూరుడు జన్మించాడు. అనూరుడు గరుక్మంతుని సోదరుడు, అదే విధంగా సూర్యభగవానునికి రథసారథికూడా. ఒకానొక సమయంలో వినత పుత్రుని చూసుకోవాలన్న కుతూహలంతో అండం పగులగొట్టిందట. అప్పుడు సగం శరీరంతో అనూరుడు జన్మించాడు. బ్రహ్మ అనూరుడిని సూర్యునికి రథసారథిగా నియమించి నీవు భూలోకాన మొదట కనిపిం చిన కాలాన్ని బ్రహ్మముహూర్తకాలమంటారని, ఆ సమయంలో ఏ నక్షత్రాలు, గ్రహాలు చెడు చేయలేవని అనూరుడికి వరమిచ్చాడు. అందువల్లనే బ్రహ్మ ముహూర్త కాలం అన్ని శుభకార్యాలకు ఉన్నత మైందని శాస్త్రం చెబుతోంది. ఈ బ్రహ్మముహూర్త కాలంలో చదివే చదువు, చేసే శుభకార్యాలు దిగ్విజయమౌతాయని చెబుతారు.

**బ్రహ్మముహూర్తంలో ఏం చేయాలి..? :** తెల్లవారుజామున 3 గంటల నుంచి 6 గంటల వరకు ఉండే సమయం బ్రహ్మముహూర్తం. ఆధ్యాత్మిక చింతనకు, జపతపాదులకు, ధ్యానానికి, విద్యార్థుల చదువు కు చాలా విలువైన సమయం. ఈ బ్రహ్మముహూర్త కాలంలో మనస్సు ప్రశాంతంగా ఉండి స్వచ్ఛంగా ఉంటుంది. సాత్వికమైన వాతావరణం గోచరిస్తుంది. మనస్సు స్వచ్ఛంగా తెల్లవారగితంలా దైనందిన జీవితంలో ఉండే గజిబిజి ఏమీ లేకుండా ప్రశాంతంగా ఉంటుంది. ఎలాంటి రాగద్వేషాలు, ఇష్టాయిష్టాలు లేని సమయం ఇది. ఈ సమయంలో మన మనస్సు ఎలా కావాలంటే అటు తేలికగా మారుతుంది. ఈ సమయంలో ఆధ్యాత్మిక ఆనందాన్ని చాలా సులువుగా పొందవచ్చు.

## గ్రామాల్లో త్రాగునీటి సమస్యలు రాకుండా చూడండి



మాట్లాడుతున్న ఎంపీడీవో జవహర్ బాబు

కొత్తపల్లి, మేజర్‌న్యూస్ : మండలం లోని అన్ని గ్రామాల్లో త్రాగునీటి సమస్య లు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీ వో కార్యాలయంలో పంచాయతీ కార్య దర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జవహర్ బాబు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సక్రమంగా త్రాగునీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. మంచినీటి కొరత లేకుం డా చూసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదన్నారు. కలుషిత నీటి సరఫరా లేకుండా చూడాల న్నారు. నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.గ్రామాల్లో ప్రజల నుంచి వినతులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు.ఇఓఆర్డీ శివరామయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కఠినంగా శిక్షించాలి



టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర

నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్ : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలింగ్ బూత్‌లో దౌర్జన్యం చేసి ఈవీఎంలను ధ్వంసం చేయడమే కాకుండా అడ్డు వచ్చిన టీడీపీ నాయకులపై దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామని, తక్షణే అతన్ని కఠినంగా శిక్షించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో దాడులకు తెగబడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రోద్బలంతో విధ్వంసకాండ సృష్టించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టన్నారు. ఇలాంటి రామకృష్ణారెడ్డిలు వైసీపీలో మరెందరో ఉన్నారని, ఇలాంటి వారు మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ప్రజలకు శాంతి భద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## మహానందీశ్వరుని సన్నిధిలో పోల్యూషన్ కంట్రోల్ బోర్డు సెక్రటరీ



మహానంది క్షేత్రంలో సెక్రటరీని జ్ఞాపికతో సత్కరిస్తున్న ఈవో

మహానంది, మేజర్‌న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో ఆంధ్రప్రదేశ్ పోల్యూషన్ కంట్రోల్ బోర్డు సెక్రటరీ శ్రీధర్ కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. బుధవారం క్షేత్రానికి వచ్చిన వీరికి ఆలయ మర్యాదలతో ఈవో చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనం తరం వారు శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేయగా అధికారులు జ్ఞాపికతో సత్కరించారు.

## ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

– కర్నూలు రేంజ్ డీఐజీ సి.హెచ్.విజయరావు

కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్: ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ సి.హెచ్.విజయరావు అన్నారు. బుధవారం నాలుగు జిల్లా ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందరూ టీమ్‌గా బాగా పనిచేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచాలని, పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, కమాండ్ కంట్రోల్‌నుంచి అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని, కౌంటింగ్ కేంద్రాల వద్ద నిర్దేశితదూంలో అందరూ విధంగా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఏజెంట్లు, అభ్యర్థులు మాత్రమే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ బాణ సంచా నిల్వలు కూడా లేకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. మే 30వతేదీ నుంచి ప్రతి జిల్లాల సరిహద్దు ప్రవేశం, నిష్క్రమణల దగ్గర చెక్ పోస్టులు ఏర్పాటు చేసుకోవాల్నారు. ట్రబుల్ మాంగర్స్ ను బైండోవర్ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయా జిల్లా ఎస్పీలు జి.కృష్ణకాంత్, రఘువీర్‌రెడ్డి, బి.కృష్ణరావు, వైఎస్సార్ కడప జిల్లా అదనపు ఎస్పీ సుధాకర్, డీఎస్పీలు ఉన్నారు.

## ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించండి

నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ : నెట్‌వర్క్ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించాల ని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు సంబంధిత యాజమాన్యాలను సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాణాపాయ, అత్యవసర కేసులకు ఆరోగ్యశ్రీ కింద వైద్య చికిత్సలు అందించాలని నెట్‌వర్క్ ఆసుపత్రులకు యాజమాన్యాలను కోరారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల బకాయిలన్నింటిని ప్రభుత్వం త్వరలో చెల్లిస్తుందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రూ.203 కోట్ల నిధులు మంజూరయ్యా యని, మిగిలిన బకాయిలను కూడా విడుతల వారీగా ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. అత్యవసర కేసులకు సంబంధించిన చికిత్సలకు ఆటంకం కలగకుండా ఆసుపత్రుల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈసమా వేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ రూపేంద్రనాథరెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ జఫరుల్లా, సూపరింటెండెంట్ వరప్రసాద్, యాజమాన్యాలు పాల్గొన్నారు.

సూర్య

గురువారం | 23 మే 2024

# ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు..

**పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలతో జిల్లా ఎస్పీ కవాతు నిర్వహణ..**
**స్ట్రాంగ్ రూమ్స్ పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ అమలు..**
**జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి**



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం కేంద్ర సాయుధ బలగాలతో, స్థానిక పోలీస్ అధికారులతో వారి సిబ్బందితో కలిసి నాలుగు రోడ్ల జంక్షన్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో జూన్ 4వ తేదీన జరుగునున్న ఎన్నికల కౌంటింగ్ ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ఉండేందుకు మరియు ప్రజలకు భరోసా కల్పించేందుకు ఈ పోలీస్ కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో అన్ని స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గ్రామ పెద్దలు, ప్రజలతో మమేకమై, గ్రామాల్లో అందరూ వివాదాలకు దూరంగా ఉండాలని, శాంతియుతంగా మెలగాలని, జిల్లా మొత్తం 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని మరియు ఇవిఎంలను ఉంచిన స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజున అనగా జూన్ 4వ తారీఖున కౌంటింగ్ కేంద్రాలకు ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు మరియు వారి ఏజెంట్లు మినహా ఎవ్వరు అనవసరంగా కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలకు రావద్దని సూచించారు. ఎన్నికలలో గెలిచిన అభ్యర్థులు మరియు వారి సంబంధించిన వ్యక్తులు ఎలాంటి విజ యోత్సవ ర్యాలీలు చేయరాదని మరియు క్రాకర్స్ కాల్చుటకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. రౌడీషీటర్లు..నేరచరిత్ర కలిగిన వ్యక్తులపైనిఘా ఉంచడం జరిగిందని, గ్రామాల్లో అందరూ వివాదాలకు దూరంగా ఉండాలని, శాంతియుతంగా మెలగాలని కోరారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్య లు తప్పవని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి షేక్ షర్ఫుద్దీన్, సీఐలు రమేష్ బాబు, హనుమంతు నాయక్, ఎస్సైలు షేక్ నగిన, వెంకటరెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టండి



ఇసుక అక్రమ తవ్వకాలపై కమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా వ్యాప్తంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన చాంబర్లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ చైర్మన్, కలెక్టర్ అధ్యక్షతన ఇసుక అక్రమ తవ్వకాలపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు గట్టి నిఘా ఉంచి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ ఇసుక రవాణా, తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలని సబ్ డివిజనల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మండల తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులచే ముమ్మర తనిఖీలు నిర్వహించి ఇసుక అక్రమ తవ్వకాలను నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకుని ఆ మేరకు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి లేని ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లను సీజ్ చేసేందుకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని ఉప రవాణా అధికారిని కలెక్టర్ ఆదేశించారు. రాత్రి వేళల్లో నంద్యాల పట్టణ సమీపంలోని కుందూనదిలో కొందరు వ్యక్తులు అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు అక్కడి పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఎంఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కెసిసి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా గనులు, భూగర్భ శాస్త్ర అధికారి రామచంద్ర, ఉపరవాణా అధికారి శివారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి, భూగర్భ జలశాఖ ఉప సంచాలకులు రఘురాం, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులను నష్ట పరిస్తే విజయ డెయిరీ సహించదు

- సొసైటీ అక్రమాలపై విచారణకు ఆదేశించిన చైర్మెన్
- ఇద్దరిని విధుల నుంచి తప్పించాం
- నాలుగు సొసైటీలపై అంతర్గత విచారణ
- బాధ్యులు ఎంతటివారైనా ఉపేక్షించం
- డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :**



మాట్లాడుతున్న డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి

ఎంతో చరిత్ర కలిగిన విజయ డెయిరీ యాజమాన్యం రైతుల పక్షాన నిలుస్తుందని డైరెక్టర్ విజయసింహారెడ్డి తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం డెయిరీ యాజమాన్యం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. రైతులకు మూడేళ్ళ నుంచి బోనస్‌లను చైర్మెన్ ఎస్వీ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బోర్డు యాజమాన్యం అందించిందని గుర్తు చేశారు. నంద్యాలలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. విజయ డెయిరీ పరిధిలో రైతులకు నష్టపరిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. నెల రోజుల క్రితం నాలుగు సొసైటీలలో అక్రమాలు జరిగినట్లు గుర్తించామ న్నారు. అక్రమాలపై చైర్మెన్ జగన్మోహన్‌రెడ్డి విచారణకు ఆదేశించార న్నారు. ఆడిట్ అధికారుల పర్యవేక్షణలో అంతర్గత విచారణ జరుగు తుందన్నారు. ఇప్పటికే ఒక సొసైటీ డెయిరీ మేనేజర్ శివశంకర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ రాజేష్‌లను విధుల నుంచి తప్పించామన్నారు. యాజ మాన్యం ఆడిటర్లు కొన్ని సొసైటీలలో పాల శాతంలో వ్యత్యాసాన్ని గుర్తించారన్నారు. బోర్డు సమావేశం దృష్టికి తీసుకొని రావడంతో చైర్మెన్ వెంటనే ఆడిట్ శాఖతోపాటు క్వాలిటీ కంట్రోల్ అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి విచారణ కు ఆదేశించారన్నారు. ప్రతి ఏడాది మార్చి 31వ తేదీన డెయిరీ ఆడిట్ జరుగుతుందన్నారు. విజయ డెయిరీ సొసైటీల నుంచి పాలను సేకరిస్తుందన్నారు. రైతుల నుంచి సొసైటీలు సేకరించి చిల్లింగ్ సెంటర్ల ద్వారా డెయిరీకి పంపుతారన్నారు. సొసైటీ వెన్న శాతానికి డెయిరీకి చేరుకునే పాల వెన్న శాతానికి తేడాను అధికారులు గుర్తించారన్నారు. రుద్రవరం చిల్లింగ్ సెంటర్ అకౌంట్స్‌ను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ చిల్లింగ్ సెంటర్ పరిధిలోని కొన్ని సొసైటీలపై ఆరోపణలు ఉన్నాయన్నారు. ఏడాది క్రితం మ్యానువల్ రికార్డ్ వ్యవస్థ ఉండిందని, ప్రస్తుతం కంప్యూటర్ వ్యవస్థను తీసుకొని వచ్చామన్నారు. ఇందులో ఎలాంటి అవకతవకలకు పాల్పడే అవకాశం లేదన్నారు. సొసైటీ అక్రమాల వల్ల రైతులకు నష్టం జరిగిందా జరగలేదా అనేది విచారణలో బయట పడుతుందని ఒక ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. డెయిరీ పరిధిలో 105 సొసైటీలు ఉన్నాయని, అందులో ప్రస్తుతం కొన్ని సొసైటీలలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. సొసైటీ అక్రమాలపై విచారణ పారదర్శకంగా ఉండాలని ఇద్దరు అధికారులను విధుల నుంచి తప్పించామన్నారు. విచారణ నివేదిక అందిన తర్వాత బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. రైతులకు నష్టం కలిగించిన వారు ఎంతటివారైనా చైర్మెన్ ఆధ్వర్యంలోని బోర్డు కమిటీ ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. విజయ డెయిరీ యాజమాన్యం గడచిన నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. గతంలో రూ.160 కోట్ల వ్యాపారం సాగించిన డెయిరీ ప్రస్తుతం ఆ వ్యాపారం సుమారు రూ.350 కోట్లకు చేరిందన్నారు. విచారణ నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు.

## పోస్టల్‌బ్యాలెట్ బాక్సులను జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలి

**– కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న పాలకుర్తి తిక్కారెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** సార్వత్రిక ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ బాక్సులను జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావుయాదవ్ కలిసి మాట్లాడారు. కర్నూలు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని ట్రెజరీ కార్యాలయాల్లో ఉంచారన్నారు. అయితే అక్కడ వాటికి భద్రత లేదన్నారు. కావునా ఆ బ్యాలెట్ బాక్సులను జిల్లా కేంద్రానికి తరలించి భద్రపరచాలని కోరారు. వెంటనే జిల్లా కలెక్టర్ దీనిపై స్పందించి పోస్టల్ బ్యాలెట్ బాక్సులను జిల్లా కేంద్రానికి తరలించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు నాగరాజుయాదవ్, ముంతాజ్, జేమ్స్, సత్రం రామక్రిష్ణుడు, పేక్షావలి, రామాంజనేయులు, జూటూరు రవి, టి.క్రిష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీమద్దులేటి నృసింహ స్వామి కల్యాణోత్సవం



పెళ్ళి అలంకరణలో స్వామి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** శ్రీలక్ష్మీ నృసింహ స్వామి జయంతి పురస్కరించుకుని పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీఘన మద్దులేటి లక్ష్మీ నృసింహ స్వామి వారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు వేదోక్త మంత్రోచ్చారణలతో కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని భక్తులు తన్మయత్వంలో వీక్షించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం చేశారు.

**శ్రీసంజీవనగర్ కోదండ రామాలయంలో :** పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు స్వామి వారికి పంచామృత అభిషేకం విశ్వక్సేనపూజ, పుణ్య హవాచనం, నవ కుంభారాధన, రక్షాబంధనం తదుపరి వేదాధ్యయనం, అగ్ని ప్రతిష్ఠ, హోమం, మూలమంత్ర హోమంలు, పూలంగి సేవ సువర్ణ రత్న ఆభరణ అలంకారం, సామూహిక విష్ణు సహస్రనామార్చన పూజ, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు.



శ్రీలక్ష్మీ నృసింహ స్వామి అమ్మవార్లకు కంకణధారణ చేస్తున్న దృశ్యం



పెళ్ళి అలంకరణలో స్వామి అమ్మవార్లు